

## వరదలతో ప్రాణనష్టం కలగకుండా పటిష్ట చర్యలు

### వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పెద్దపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వరదల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ రామకృష్ణారావుతో కలిసి ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. అలాగే యూరియా నిల్వలపై కూడా అధికారులు పలు జాగ్రత్తలు తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నాయని, ఈ మేరకు ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, వరద పరిస్థితులపై అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాలకు కోటి రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేస్తామన్నారు. వరదల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని, నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు. సహాయక చర్యల్లో పోలీసుల సహకారం తీసుకోవాలని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరుగుతుందని, రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో పెట్టాలని, ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాలని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోలీసులు క్రమశిక్షణతో పని చేయాలి



ఆయుధాలు వాడే విధానాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

కోల్‌సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోలీసులంటే ప్రజల్లో గౌరవం పెంచే విధంగా క్రమశిక్షణతో, నిజాయితీతో పని చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా సూచించారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడారు. పెండింగ్, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల వివరాలు, వారిపై ఉన్న కేసులు, కదలికల గురించి వాకబు చేశారు. అనుమానితులు, కేడీలు, డీసీల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది ఆయుధాలు వినియోగించే తీరు పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, నిబద్ధతతో, నిజాయితీతో వ్యవహరించాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, వారి పట్ల మర్యాదతో వ్యవహరించాలన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసు అధికారులు, సిబ్బంది పని తీరును సీపీ అభినందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.



## ఆసుపత్రిలో ఇద్దరు వైద్యుల నియామకం

మంథని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు మెరుగైన సేవలు అందించడానికి మరో ఇద్దరు డాక్టర్లను నియమించినట్లు జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం రూ.5 లక్షలతో వెయిటింగ్ హాల్ నిర్మాణం చేపట్టామన్నారు. మాతా శిశువు ఆసుపత్రిలో రూ.12 లక్షలతో అల్ట్రా సౌండ్ స్కానింగ్, నవజాత శిశువుల కోసం 1.11 లక్షలతో వార్మర్, ఫోటో థెరపీ, రూ. 1.80 లక్షలతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రారంభిస్తామన్నారు.





ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్

# ఆర్‌ఎఫ్‌సీఎల్ మళ్లీ షట్‌డౌన్

## యూరియా ఉత్పత్తి నిలిపివేత

- వరుసగా సాంకేతిక వైఫల్యాలు
- నాణ్యతలేని అమ్మోనియా పైప్‌లైన్లు...
- తెలంగాణ రైతాంగానికి యూరియా ఇక్కట్లు...

కోల్‌సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో గురువారం అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో ఉత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్‌ను వెంటనే షట్‌డౌన్ చేశారు. ప్రాజెక్టులో నాణ్యత లేని అమ్మోనియా పైప్‌లైన్లు గుదిబండగా మారాయనే విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచి ఈ అమ్మోనియా పైప్‌లైన్లు లీకేజీలతో సతాయిస్తున్నాయి. గత నెల 16న ఇదే అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ఈనెల 4న ఉత్పత్తిలోకి వచ్చింది. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉండడం, కేంద్రం నుంచి కోటాకు తగ్గట్టు యూరియా సరఫరా చేయకపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతోంది.

ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఆగస్టులో తెలంగాణకు 65వేల టన్నుల యూరియాను సరఫరా చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ కోటా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చింది. దీంతో 4వ తేది నుంచి 14వ తేది వరకు పది రోజుల సమయంలోనే 20వేల టన్నులు రాష్ట్రానికి యూరియా సరఫరా చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాలు అయిన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు మిర్యాలగూడ, తదితర ప్రాంతాలకు యూరియాను సరఫరా చేశారు. గురువారం కూడా నిజామాబాద్‌కు యూరియా రేక్‌ను పంపారు.

రాష్ట్రంలో యూరియా అవసరాలు పెరిగిపోయిన పరిస్థితుల్లో డిమాండ్‌ను బట్టి ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే 6వేల టన్నులు సరఫరా చేశారు. ఇటీవల రామగుండం నియోజకవర్గంలో యూరియా కొరత ఏర్పడడంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తితో అదనంగా యూరియాను సరఫరా చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో గురువారం ప్లాంట్‌లో సాంకేతిక అవరోధాలతో ఉత్పత్తి నిలిచిపోవడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ వర్గాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి నెలా ఖరు వరకు 50వేల నుంచి 55వేల టన్నుల రవాణాకు అవకాశం ఉండేది. కానీ ప్లాంట్ షట్‌డౌన్‌తో

మిగతా 8వ పేజీలో

## జిల్లా పంచాయతీ అధికారికి జాతీయ పురస్కారం

పెద్దపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన ప్రతినిధులకు గురువారం జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. మంథని మండలం చల్లపల్లి గ్రామానికి మహిళా స్నేహ పూర్వక అవార్డు ప్రకటించారు. రాష్ట్రం తరఫున నోడల్ ఆఫీసర్ హోదాలో ఢిల్లీలో డీపీవో వీరబుచ్చయ్యకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. చర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి కూడా అవార్డు అందజేశారు. రాష్ట్రం నుంచి ఆరు జిల్లాలకు అవార్డులు వచ్చాయి. పెద్దపల్లి, రంగారెడ్డి, గద్వాల, జనగామ, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఎంపికయ్యాయి.



అవార్డుతో డీపీవో వీరబుచ్చయ్య

# సహకార సంఘాల పాలకవర్గాల గడువు పొడిగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సొసైటీలను పట్టించుకోని పాలకవర్గం స్థానంలో మార్పులు
- పర్సన్ ఇన్‌చార్జీల నియామకానికి అనుమతి



సుల్తానాబాద్ సహకార సంఘం కార్యాలయం

సుల్తానాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పాలకవర్గాల గడువు మళ్లీ పొడిగించారు. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల పాలకవర్గాల గడువు మరో ఆరు నెలల పొడిగిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జరీ చేసింది. దీంతో సంఘాల పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా ఏడాది పాటు కొనసాగే వెసలుబాటును ప్రభుత్వం కల్పించినట్టయింది. అయితే ఈసారి ఉత్తర్వుల్లో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఎవరైతే సంఘాల నిర్వహణలో ఉదాసీనంగా ఉండడం, అసలు పట్టించుకోకపోవడం లేదా ఏమైన ఆరోపణలు ఉంటే వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. సహకార సంఘాల పాలకవర్గాల గడువు వాస్తవంగా ఈ ఏడాది ఫిబ్రవరి 15 వరకే ముగిసింది. కానీ సింగిల్‌విండోలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం వాటిని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆగస్టు 14 వరకు సంఘాల గడువు ఉంది. ఈ సారి కూడా ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో గురువారం గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొడగింపు ఉత్తర్వుల మేరకు పాలకవర్గాలు గతంలో లాగా పూర్తి స్థాయిలో కాకుండా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సారి అసలు పొడిగింపు ఉండదని ప్రత్యే కాధికారులను నియమిస్తారని ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా ఒక రోజు ముందుగా పొడిగింపు ఉత్తర్వులు జారీ అవడం పాలకవర్గాలకు తీపి కబురే.

**● 2019లో సంఘాలకు ఎన్నికలు**

జిల్లాలో ఇరవై సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు 2019లో గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గడువు పూర్తయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరునెలలు పొడిగించారు. ప్రస్తుతం మరోసారి పొడిగింపే జరిగింది.

**● ఆశావహుల్లో నిరాశ**

సహకార సంఘాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల్లో కొంత నిరాశ నెలకొంది. సహకార సంఘాల అధ్యక్షులు, డైరక్టర్లు చాలా మంది గత

మిగతా 8వ పేజీలో



## ఓట్ల దొంగలు గద్దె దిగాలి...



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వచ్ఛమైన, న్యాయ సమ్మతమైన ఎన్నికల కోసం ఏకతాటిపైకి రావాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి మెయిన్ చౌరస్తాలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో ములాఖత్ అయి ఓట్ల చోరీకి పాల్పడుతుందన్నారు. ఒక్కో నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఓట్లను చోరీ చేస్తున్నారన్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా దొంగదారిలో బీజేపీ, దాని మిత్రపక్షాలు గద్దెనెక్కుతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆధారాలతో విషయాన్ని బయట పెట్టారన్నారు. ఓట్ల దొంగలు వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు మహంకాళి స్వామి, గట్ల రమేష్, పెద్దెల్లి ప్రకాష్, ముస్తాఫా, దూళికట్ట సతీష్, మెంటం ఉదయ్‌రాజ్, సింహాచలం, కొప్పుల శంకర్, మాలెం మధు, నజీమొద్దీన్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

## 17న సీఐటీయూ మున్సిపల్ జిల్లా మహాసభలు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పెద్దపల్లి జిల్లా నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ..నాలుగవ జిల్లా మహాసభలు ఈ నెల 17న మంథని లో జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ వెంకటస్వామి, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరేపల్లి చంద్రయ్య,బొంకూరి సాగర్, కమిటీ సభ్యులు బడుగు అంజయ్య,బొంకూరి శంకర్,మద్దెల రాజయ్య, కవ్వంపల్లి భూలక్ష్మి నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## లక్ష్యం మేరకు మహిళా సంఘాలకు రుణాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నిర్దేశిత లక్ష్యం ప్రకారం మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్ రుణాలు వంద శాతం మంజూరు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మహిళా సంఘాలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు ఎన్‌పీఏ కాకుండా వంద శాతం రుణ చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో మహిళా సంఘాల సభ్యులు ఉంటే ఇంటి నిర్మాణానికి లక్ష రూపాయల రుణం అందించాలన్నారు. ఈ నెల 26న విదేశాల్లో ఉపాధి అవకాశాలపై కలెక్టరేట్‌లో టామ్ కామ్ ద్వారా అవగాహన సదస్సును నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునేలా ప్రచారం కల్పించాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు డీఆర్‌డీఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైన మైదానం

## స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను ఆయన అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. అధికారులు ప్రొటోకాల్ సమస్యలు లేకుండా చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఉదయం 9.25 గంటలకు ముఖ్యఅతిథి కలెక్టరేట్‌కు చేరుకుంటారని, 9.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, జాతీయ గీతాలాపన, గౌరవ వందనం, పరేడ్, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ ఉంటుందన్నారు. స్వాతంత్ర వేడుకలకు సంబంధించిన సౌండ్ సిస్టం, విద్యుత్ సరఫరా, డయాస్, టెంట్లు, బారికేడ్లు తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి సూచనలు చేశారు. భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, మున్సిపల్ శాఖ, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఆర్డీఓ గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ అధికారులు పాల్గొన్నారు.



వేడుకల స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

## హర్ ఘర్ తిరంగా యాత్ర



కోల్‌సిటీటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రమేష్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. విద్యార్థులు, యువతీ, యువకులు జాతీయ జెండాలతో ర్యాలీ తీశారు. బీజేపీ నాయకులు కోమళ్ల మహేష్, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు సమ్మారావు మాట్లాడుతూ దేశ ఐక్యతే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన ప్రధాని నరేంద్రమోదీ అందరికి స్ఫూర్తి అన్నారు. ఐత పవన్‌కుమార్, కొండపర్తి సంజీవ్ ఆకాష్, తోకల రాజ్‌కుమార్, ఆడెపు కార్తీక్, రంజిత్, పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

● పలువురు విద్యార్థులకు గాయాలు


హర్షవర్ధన్(ఫైల్)

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెల్లారితే స్వాతంత్ర్య దినోత్స వం, సంతోషంగా ఇంటికి వెళ్లి ఉదయాన్నే జండవందనానికి వెళ్లాలని సంతోషంతో వెళ్తున్న విద్యార్థుల ఆటో కాసేపటిలో ఇంటి చేరుతామనే లోపే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా, పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు తిమ్మాపూర్‌లోని ఓ పాఠశాలలకు ఆదే గ్రామానికి చెందిన ఆటోలో వెళ్లి వస్తుంటారు. గురువారం కూడా స్కూల్‌కి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఇంటికి సమీపంలోకి రాగానే విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోకు కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి కొద్ది దూరం వరకు రోడ్డుకు రాసుకుంటూ పోయింది. ఆటోలో కుడి వైపున కూర్చున్న నాంపల్లి హర్షవర్ధన్ (10) నాలుగవతరగతి విద్యార్థి తలనేలకు రాక్కుంటూ వెళ్లింది. స్థానికులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు హర్షవర్ధన్ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు నాంపల్లి శ్రీనివాస్, సమత ఆసుపత్రి వద్ద రోదించడం అందరినీ కలిచి వేసింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇతర విద్యార్థుల్లో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయాలు అలుముకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ అనిల్‌ను ఎల్ఎండీ పోలీసులు అదుపులోని తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## క్షణికావేశంలో పురుగుల మందు తాగి మహిళ బలవన్మరణం


సంధ్య (ఫైల్)

ధర్మారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూతురును ఎందుకు కొడుతున్నావని తల్లి మందలించడంతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కటికె నపల్లి గ్రామానికి చెందిన సంపంగి సంధ్య(25) మంగళవారం కూతురు వర్షిత అల్లరి చేస్తుందని కొప్పడుతూ చేయిచేసుకొంది. దీంతో సంధ్య తల్లి మామిడి సత్తమ్మ ఎందుకు కొడుతున్నావని మందలించింది. క్షణికావేశానికి లోనైన సంధ్య పత్తిచేను వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటుఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంధ్య బుధవారం రాత్రి మృతి చెందింది. సంధ్య తల్లి మామిడి సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# రేకుర్తి కంటి ఆసుపత్రిలో విస్తృత సేవలు

● మెల్లకన్ను, కంటి క్యాన్సర్‌కు చికిత్సలు

● 26వ తేదీన ప్రారంభం


రేకుర్తి కంటి ఆసుపత్రి

భగత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మదేకర్ ఉదార రేకుర్తి కంటి ఆసుపత్రిలో విస్తృత సేవలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను మినహాయిస్తే ఉత్తర తెలంగాణలో ఏ పట్టణంలో లేని అరుదైన చికిత్సలను రేకుర్తి కంటి ఆసుపత్రిలో ప్రారంభించనున్నారు. ఈ నెల 26వ తేదీన రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్ల కన్నుతో పాటు, కంటి క్యాన్సర్ చికిత్స కోసం ఓక్యులోప్లాస్టీ చికిత్స లను అందుబాటులోకి తేనున్నారు. ప్రతీనెల ఒకరోజు ఈచికిత్సల కోసం వైద్యులు అందుబాటులో ఉండనున్నారు. దీనితో కంటి సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా రేకుర్తిలోనే చికిత్సలు అందించడానికి ఏర్పాట్లు చేశారు.

● మెల్ల కన్నుకు చికిత్స

లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో మెల్లకన్నుకు చికిత్సను ప్రారంభిస్తున్నారు. చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, చిన్న పిల్లల్లో శుక్లమ్ (మోతె బిందు) కంటి నరానికి సంబంధించిన చికిత్స కోసం నిపుణులైన వైద్యులు వచ్చి చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

● కంటి క్యాన్సర్, ఓక్యులోప్లాస్టీ చికిత్స

కంటి క్యాన్సర్‌కు సంబంధించి ఓక్యులోప్లాస్టీ చికిత్సను ఈ నెల 26వ తేదీన రేకుర్తిలో చికిత్స అందించనున్నారు. కన్నులో అద్దంలో వలె తళుక్ మొదలవ్వగానే కళ్లలో తేడా తెలుస్తుంది. మెల్లకన్ను లక్షణం ఉంటుంది. కళ్లలో మునుపటి కన్నా చూపు తక్కువవు తుంది. కళ్ల నుంచి నీరుకారుతుంది పొద్దున లేవగానే కళ్లు ఎర్రబడే లక్షణాలు కనిపిస్తాయి. కనురెప్పలు వాటంతట అవే మూసుకు పోతాయి. ప్రోస్టేట్సిస్ చికిత్స, ఒకకన్ను చిన్నగా కనిపిస్తుంది, రేటినోబ్లాస్టోమాను (ఇది ఒక కంటి క్యాన్సర్ పండు) మొదటి దశలో కనుగొని చికిత్స ప్రారంభిస్తే రోగాన్ని నయం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

**అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**కొండా వేణుమూర్తి, చైర్మన్ రేకుర్తి కంటి ఆసుపత్రి**



రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్లకన్ను, ఓక్యాలో ప్లాస్టీ సేవలను రేకుర్తిలో ప్రారంభిస్తున్నాము. కొత్తగా సర్జికల్ రెటినా సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

## సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌కు రాష్ట్రపతి మెరిటోరియస్ అవార్డు


ఎస్ ఆంజనేయరాజు


గోపాల్‌రెడ్డి

జ్యోతినగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సెంట్రల్‌ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) డిప్యూటీకమాండెంట్ ఎస్.ఆంజనేయ రాజుకు ప్రతిష్ఠాత్మక ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్‌మెడల్ లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీ ప్రాజెక్టులో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌గా పని చేస్తున్న ఆంజనేయరాజు ఉత్తమ సేవలను గుర్తించిన కేంద్రం రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ పతకానికి ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం(ఢిల్లీ) నుంచి సర్క్యులర్ విడుదలైంది. ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపికైన ఆంజనేయరాజును సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిసి ఒవికె.శాస్త్రి, అధికారులు, జవానులు, ఎన్టీపీసీ అధికారులు అభినందించారు.

**రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికైన జమ్మికుంట ఫైర్ ఆఫీసర్**

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట అగ్నిమాపక కేంద్రంలో పనిచేసే లీడింగ్ ఫైర్ ఆఫీసర్ బి గోపాల్‌రెడ్డి రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికయ్యారు. ఆయన 33 సంవత్సరాలు ఫైర్‌స్టేషన్‌లో విధుల నిర్వహిస్తున్నాడు. వివిధ అగ్నిప్రమాదాల్లో ఆయన ప్రాణ, ఆస్తి నష్టనివారణలో విశేష సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు గతంలో ఉత్తమ సేవా పతకం అందించింది. ఈసందర్భంగా ఆయనను జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి, జమ్మికుంట అగ్నిమాపక సిబ్బంది అభినందించారు.

## చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్వంద శ్రీనివాస్(40) అనేడ్రైవర్ గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. శ్రీనివాస్ పలువురి దగ్గర రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతోపాటు అతడిభార్య కవిత ఆరోగ్యం బాగాలేదని తరచూ బాధపడేవాడు. ఈనెల 12న శ్రీనివాస్ లక్ష్మీపూర్ శివారులోని ఆలయ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నం చేశాడు. బంధువులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. భార్య కవిత ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కన్నెబత్తుల చంద్రయ్య(82) కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం పనినిమిత్తం కట్టరాంపూర్ ఇంటినుంచి మానకొండూర్‌కు తన ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. బయటు దేరిన కొద్దిసేపటికే మానేరుబ్రిడ్జి నుంచి అలుగు నూర్ వైపువస్తున్న క్రమంలో గుర్తుతెలియనివాహనం చంద్రయ్య ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో చంద్రయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూమృతిచెందాడు. మృతుడు చంద్రయ్య బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.

## ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

వీణవంక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన పానుగంటి ప్రమీల(56) వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసులువివరాల ప్రకారం.. కొంతకాలంగా కటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రమీల బాత్‌రూమ్‌లోని రాడుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు మృతురాలు ప్రమీల భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేటకు చెందిన ఎలుకపల్లి అంజయ్య గల్ఫ్‌లో మరణించగా మృతదేహం గురువారం ఇంటికి చేరింది. సౌదీఅరేబియాలో గతనెల24న అంజయ్య మృతి చెందగా 22రోజుల తర్వాత మృతదేహం ఇంటికి చేరింది. సౌదీ అరేబియా నుంచి మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు కృషిచేసిన జాడి మల్లేశం, మహ్మద్ అబ్దుల్‌రఫిక్, షేక్ కలీం, మహమ్మద్‌కు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. కాగా గల్ఫ్‌బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్రకార్యదర్శి బూత్కూరి కాంత డిమాండ్ చేశారు.

## వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కేతిరెడ్డి శ్రీలత ఇంటి ఎదుట గల సీసీ కెమోరాలు, కారు అద్దాలను పగలగొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామనికిచెందిన శ్రీలత సంవత్సర కాలంగా కొత్తపల్లిలో ఉంటోంది. శ్రీలత అన్న మాడ కృష్ణారెడ్డితో ఆస్తులకు సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి మాడ కృష్ణారెడ్డి శ్రీలత ఇంటికి వెళ్లి సీసీ కెమోరాలు ధ్వంసం చేసి ఇంట్లో ఎవరూలేని సమయంలో తలుపులు బద్దలు కొట్టి యాభై వేయిల రూపాయలు సెల్‌ఫోన్ తీసుకోని ఇంటి ముందు కారు అద్దాలు పగలగొట్టినట్టు శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## పత్తి చేను ధ్వంసం

● పలువురిపై కేసు నమోదు

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అకారణంగా పత్తి చేను ధ్వంసం చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన మండే ఎల్లయ్య అనే రైతుకు చెందిన సుద్దాల గ్రామ శివారులోని 403 సర్వేనెంబర్‌లో ఎకరం 30 గుంటలు ఉండగా, అందులో పత్తిచేను సాగు చేస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌కు చెందిన కుడుకల రాములు, ఎల్లయ్య, మంజుల, మరికొంత మంది పత్తి చేను ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వారిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

# నమ్మించి క్రెడిట్ కార్డుల డబ్బుల స్వాహా

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు ● వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ నరసింహారావు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న హనుమకొండ ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుల ద్వారా కమీషన్ తీసుకోకుండా డబ్బులు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి లక్షల్లో డబ్బులు స్వాహాచేసిన మోసగాడిని హనుమకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ నరసింహారావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లాజమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నిందితుడు నేరెళ్ల అరుణ్ 2023వలో హనుమకొండ రాయపురలో భద్రకాళి డిజిటల్ సేవా షాప్‌పెట్టి ఆన్‌లైన్ అప్లికేషన్స్ చేసేవాడు. తరువాత ఇన్‌స్టాముద్ర యాప్‌కి, షాడ్వాల్ పే యాప్‌కి ఫీజు కట్టి డిస్ట్రిబ్యూటర్ ఐడీ తీసుకున్నాడు. తన దగ్గరికి డబ్బు అవసరం నిమిత్తం వచ్చే కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. దానికి గాను వీసా కార్డుకి 1.8శాతం, మాస్టర్ కార్డుకి 2.6శాతం బిజినెస్ కార్డు 4శాతం, రూపే కార్డుకి 1.8శాతం వారీగా డబ్బులు తీసుకునేవాడు. తన దగ్గరికి తరచుగా వచ్చే కస్టమర్లను తన వ్యాలెట్‌లో యాడ్ చేసుకొని వారి క్రెడిట్ కార్డులలో బ్యాలెన్స్ ఉంటే వారికి ఫోన్ చేసి తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి.. వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎటువంటి చార్జెస్ లేకుండా తానే వారి క్రెడిట్ కార్డుల బిల్లులు కడతానని వారిని మోసపూరితంగా మాయమాటలుచెప్పి నమ్మించేవాడు. కార్డులు స్వైప్ చేసిన తరువాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4శాతం వరకు చార్జి తీసుకొని లాభపడేవాడు. తరువాత తన బ్యాంకు ఖాతా హోల్డ్ అయ్యిందని, రెండు రోజుల తరువాత ఎటువంటి కమీషన్ లేకుండా వారికి ఇస్తానని నమ్మించి కొన్నిరోజుల తరువాత వారి క్రెడిట్‌కార్డు బిల్లులు కూడా తానే కట్టేవాడు. యేడాదిపాటు వారికి నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్‌కార్డు బిల్లులు కడుతూ క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ అలా బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్‌లోన్, అప్పులు కట్టి తన కుటుంబసభ్యులకు కూడా డబ్బులు సర్దుబాటు చేసేవాడు. అలా కస్టమర్ల క్రెడిట్ కార్డుల నుంచి సుమారుగా సుమారుగా రూ.28లక్షలు వాడుకున్నాడు. కస్టమర్లు ఫోన్‌చేయడంతో వారికి రేపుమాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఆ తరువాత తనవల్ల కాకపోవడంతో కొన్నిరోజులు ఎటైనా వెళ్లిపోతే కస్టమర్లు మర్చిపోతారనుకున్నాడు. తనువేసుకున్న పథకం ప్రకారం షాప్‌మూసేసి విజయవాడకు వెళ్లాడు. గురువారం షాపు వద్దకు వచ్చి ఖాళీచేస్తుండగా పోలీసులు నిందితుడుని పట్టుకొని అదుపులోకి తీసుకొనివిచారించగా తన నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన హనుమకొండ పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరులో ఎరువుల విక్రయకేంద్రాలపై కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో గురువారం గ్రామంలోని నాలుగు ప్రైవేట్‌ఎరువుల దుకాణాలతో పాటు డీసీఎంఎస్ కేంద్రాలను తనిఖీలు చేశారు. తనిఖీలలో ఈపాస్ గ్రౌండ్ బ్యాలెన్స్ స్టాకులకు సరిపోని ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. అనుమతిలేని గోదాములలో నిలువ ఉంచిన రూ 19,71,514 విలువైన యూరియా, డీఏపీ తదితర రసాయనిక ఎరువులను సీజ్‌చేశారు. మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. తనిఖీలలో విజిలెన్స్ తహసీల్దార్ దినేష్‌చంద్రారెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అనీల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన సంపత్ (35) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 10న బొంపల్లి గ్రామ శివారులో కారు ఢీకొనగా సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

## పురుగుల మందు తాగిన వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి చికిత్సపొందుతూ ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని మల్యాల గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు వివరాల మేరకు ఉల్లి శ్రీనివాస్(40) మద్యానికి బానిసయ్యాడు. బుధవారం అతిగా మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య కోమల మద్యం తాగవద్దని సూచించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న ఆయన ఇంటిలోని గడ్డి మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం శ్రీనివాస్ మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మంథని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్టం వెంకటేష్ (30) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన వెంకటేష్ మరోముగ్గురు స్నేహితులతో కలిసి మంథనికి వచ్చి తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి ఎగిరి కిందపడిన వెంకటేష్‌పై నుంచి లారీ వెనుక టైర్ వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి అక్కడిక్కడే మృతిచెందాడు. మంథని మండలం ధర్మారం గ్రామానికిచెందిన తిప్పాని అభిలాష్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం గోదావరిఖనికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్ నగర్‌కుచెందిన రెండ్లపద్మ ఆగస్టు12న తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించి, దానినిస్వాధీనం చేసుకున్నారు. గురువారం రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి పద్మకు ఫోన్‌ను అప్పగించారు. కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

# ఏఎంసీ గోదాంలో అదుపులోకి వచ్చిన మంటలు

● ఐదు రోజులు రాత్రింబవళ్లు శ్రమించిన అధికారులు


మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో అదుపులోకి వచ్చిన మంటలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలోని గోదాంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చెలరేగిన మంటలు గురువారం అదుపులోకి వచ్చాయి. రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలో ఉన్న గోనె సంచులు దగ్ధం కాగా గోదాం పూర్తిగా దెబ్బతింది. ఐదు రోజుల నుంచి మెట్‌పల్లి, జగిత్యాల, నిర్మల్, భీంగల్, ఖానాపూర్ అగ్నిమాపక కేంద్రాల నుంచి మంటలు ఆర్పడానికి వాహనాలను రప్పించారు. అగ్ని ప్రమాదంలో మంటలు చెలరేగడంతో గోదాం చుట్టూ ఉన్న గోడలు ధ్వంసం చేసి పై భాగంలోని రేకులను తొలగించారు. ఎక్స్‌కవేటర్లతో కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేసి మళ్లీ మంటలు రాకుండా వాటిని ఇసుకతో కప్పివేశారు. ఆరు అగ్నిమాపక యంత్రాలు, పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది ఐదు రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రమించి మంటలు అదుపు చేశారు. 2018 సంవత్సరం నుంచి మార్కెట్‌యార్డు గోదాంను సివిల్ సప్లయిస్ శాఖ వారు అద్దెకు తీసుకొని అందులో గోనె సంచులను నిల్వ చేస్తున్నారు. అందులో ఉన్న 9.70లక్షల సంచులు కాలిపోవడంతో రూ.97లక్షలు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గోదాం దెబ్బతిని మరో రూ.70లక్షల వరకు ఆస్తి నష్టం నష్టం వచ్చిందన్నారు. గోనె సంచులు, గోదాంలకు ఇన్సూరెన్స్ ఉందని, సంబంధిత అధికారులు పరిశీలించినట్లు సివిల్‌సప్లయిస్, మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. ప్రమాదంపై సివిల్‌సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ వారు వేర్వేరుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గోదాంలో మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని తహసీల్దార్ నీత తెలిపారు. మంటలను ఆర్పే కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కూన గోవర్దన్, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, ఎస్సై కిరణ్‌కుమార్, గోదాం ఇన్‌చార్జి సురేష్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

వేములవాడ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూమి తగాదాలలో కక్ష పెంచకుని ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ గురువారం తీర్పునిచ్చారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన ముత్త ఎల్లయ్యకు గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో ఎల్లయ్య భార్య వెంకటలక్ష్మి, కుమారుడు శరత్‌కుమార్‌లు వ్యవసాయం చేసకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దేశవేణి లింగయ్యకు చెందిన భూమి మల్లయ్యకు చెందిన భూమిని ఆనుకుని ఉన్నది. హద్దుల విషయంలో కొంత కాలంగా గొడవలు జరుగుతుండగా పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా పరిష్కారం లభించలేదు. ఈ తగాదాలు తొలగాలంటే ఎల్లయ్య కుటుంబాన్ని హత్య చేయాలని దేశవేని లింగయ్య, కనుకవ్వ, కనుకరాజు, శ్రీనివాస్ సరోజన, చొక్కాల తిరుమలు పథకం వేశారు. దీంతో 2020 డిసెంబరు 25వ తేదిన ఎల్లయ్య కుమారుడు శరత్‌కుమార్ తనపొలంలో ఒంటరిగా పనిచేస్తున్నాడని తెలుసుకున్న సదరు వ్యక్తులు పార, కర్రలు, రాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనపై తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ వెంకటేష్ దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు ఆరుగురికి ఐదు సంవత్సరాల జైలుశిక్ష, ఐదు వందల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్‌ను, దర్యాప్తు అధికారులను సీఎంఎస్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

# తీరొక్క దేశాల నాణేలు

● 180దేశాల 1100నాణేలు, కరెన్సీల సేకరణ ● గిన్నీస్ రికార్డు లక్ష్యం ● గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్



వివిధ దేశాల నాణేలు, సేకరించిన ఇతర దేశాల కరెన్సీతో నవీన్‌కుమార్

గంగాధర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్ 180 దేశాల 1100నాణేలు, కరెన్సీలను సేకరించి తనకంటూ గుర్తింపును సంపాదించుకున్నారు. 180దేశాలకు చెందిన 1100పాత, కొత్తరకాల నాణేలు, కరెన్సీలను సేరించాడు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని కోరి ఎంతటి కష్టమైన సేకరించాలని ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడు. ఒకప్పటి రాజుల కాలం నాటి, బ్రిటీష్ కాలం నాటి చెల్లుబాటులో ఉన్న బిల్లలు, ప్రస్తుతం చెలామణిలో ఉన్న నాణేలతో పాటు కరెన్సీలను సంపాదించాడు. ఆయన సేకరించిన దేశాల్లో అమెరికా, దుబాయ్, లండన్, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ ఉన్నాయి. ఆయన 20సంవత్సరాలుగా వీటిని సేకరిస్తున్నాడు. ఈ కరెన్సీలు, నాణేల సేకరణలో తన స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నాడు. అయితే ఒక హాబీగా సేకరించిన ఈ నాణేలతో గిన్నీస్ రికార్డుగా నెలకొల్పాలన్నదే తన లక్ష్యమని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

# పాఠశాలల్లో ఆధార్ నవీకరణ

విద్యార్థులకు ఎంతో సౌలభ్యం



విద్యార్థులకు ఆధార్ నవీకరణ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కరీంనగర్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ వివరాల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కరీంనగర్ రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఆధార్ నవీకరణ సాగుతోంది. పాఠశాలల్లోనే కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. కొంత మందికి ఆధార్ కార్డు లేక పోవడం, ఉన్నా అందులోని వివరాలు, పాఠశాలలో నమోదైనా వివరాలకు పొంతన లేకపోవడం వంటి పరిణామాలతో సమస్యలు తలెత్తాయి.

దీంతో యూడైస్‌లో నమోదుకు విద్యాశాఖ అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. యూడైస్‌లో నమోదు చేసిన వారికే ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏక రూపదుస్తులు, రవాణా భత్యం, మధ్యాహ్న భోజనం వంటి వసతులు సమకూరుతాయి. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలను అధిగమించడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో అప్‌డేట్ ప్రక్రియ చేపట్టారు. ఆధార్ నవీకరణతోపాటు కొత్తగా నమోదు చేసుకోవచ్చు. మండలానికి ఒకరిని నియమించి ప్రతీ పాఠశాలకు వెళ్లేలా కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. గతంలోనూ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఆధార్ అప్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించింది. ప్రైవేటు పాఠశాలల్లో కూడా యూడైస్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఉన్నాయి.

పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియలో భాగంగా 2019-20 విద్యాసంవత్సరంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆధార్ నమోదు కిట్లను అందించినట్లు అధికారులు తెలిపారు. కరోనా ప్రభావంతో రెండేళ్లు ఈ కార్యక్రమం నిలిచిపోయిందని, 2023-24 విద్యాసంవత్సరంలో తిరిగి చేపట్టగా మండల వనరుల కేంద్రాల నిర్వాహకులకు ఈ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. గతేడాది నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.




# నిత్య జనగణమనకు ఎనిమిదేళ్లు..




జమ్మికుంట ప్రధాన కూడలిలో జాతీయగీతం ఆలపిస్తున్న ప్రజలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో నిత్య జనగణమన ప్రారంభించి నేటికి ఎనిమిదేళ్లు పూర్తైంది. 2017ఆగస్టు 15న అప్పటి సీఐ పింగిలి ప్రశాంత్‌రెడ్డి నిత్య జనగణమన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు, మైక్ సెట్లు ఏర్పాటు చేశారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు అను సంధానం చేశారు. ప్రతిరోజు ఉదయం 7.30గంటల నుంచి దేశభక్తి గీతాలు వేస్తారు. 30 నిమిషాల పాటు దేశభక్తి గీతాలు వేసిన తర్వాత సరిగ్గా 8 గంటలకు జాతీయ గీతం ప్రారంభిస్తారు. ఆ సమయంలో ఎక్కడివారు అక్కడే నిలబడి జాతీయ జెండాకు వందనం చేస్తూ జనగణ మన ఆలపిస్తారు. ఎనిమిదేళ్లుగా జాతీయ గీతాన్ని ఆలపించడం సంతోషంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. దేశాన్ని గౌరవించుకోవడం మంచి విషయమని, ఇతర ప్రాంతాల వాసులు జమ్మికుంటను స్ఫూర్తిగా తీసుకొని నిత్య జనగణమన ప్రారంభించారు.



పాల్గొన్న నాయకులు, పోలీసు అధికారులు

### స్ఫూర్తిగా తీసుకోవడం గొప్ప విషయం

**ఎస్ రామకృష్ణగౌడ్, పట్టణ సీఐ**

జమ్మికుంటను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో నిత్య జనగణమన నిర్వహించడం గొప్ప విషయం. ప్రతిరోజు ఉదయం 7.30గంటలకు పోలీస్‌స్టేషన్ నుంచి దేశభక్తి గీతాలు వినిపిస్తాం. సరిగ్గా 8గంటలకు జాతీయ గీతం ప్రారంభిస్తాం. ఆ సమయానికి ప్రజలందరూ ఎక్కడి వారు అక్కడే నిలబడి జాతీయ జెండాకు వందనం చేస్తూ జాతీయగీతం ఆలపిస్తారు. ఇక్కడి వారిని చూసి ఇతర ప్రాంతాల వారు సైతం దేశభక్తిని అలవరుచుకోవడం సంతోషంగా ఉంది.

# కొనసాగుతున్న ఎత్తిపోతలు



గురువారం నాలుగు సిస్టర్న్స్ ద్వారా వెలువడుతున్న నీరు

ధర్మారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరిలోకి వరద నీరు పోటెత్తుతుండంతో నందిమేడారంలోని నంది పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గోదావరి ఎగువప్రాంతాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి 9848 క్యూసెక్కుల వరద నీరు వస్తుండంతో ప్రాజెక్ట్ నుంచి నందిమేడారం పంపుహౌజ్‌కు 9450 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బుధవారం మూడు మోటార్లు ఆన్‌చేసి 9450క్యూసెక్కుల నీటినిఎత్తిపోసిన అధికారులు, గురువారం ఉదయంనుంచి మధ్యహ్నం వరకు 4మోటార్లు రన్‌చేసి నీటిని ఎగువకుతరలిస్తున్నారు. నీటినిల్వలకు అనుకూలంగా సాయంత్రం నుంచి 3మోటార్ల ద్వారానే ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌నీటిసామర్థ్యం20.175 టీఎంసీలు కాగా గురువారం వరకు 15.706 టీఎంసీలకు చేరుకుంది.

### గాయత్రి పంపుహౌస్ కొనసాగుతున్న నీటి విడుదల

- మూడు పంపులతో 9450 క్యూసెక్కుల నీరు ఎస్సారార్ డ్యాంకు తరలింపు

**రామడుగు:** రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి మిడ్ మానేరు డ్యాంకు నీటి విడుదల కొనసాగుతంది. బుధవారం మూడు పంపుల ద్వారా నీటి విడుదల ప్రారంభమైన విషయం విదితమే. గురువారం కూడా మూడుపంపుల ద్వారా నీటివిడుదలను కొనసాగిస్తున్నారు.

డెలివరి సిస్టమ్ నుంచి గ్రావిటీ కెనాల్‌నీటిని పంపించిన నీరు అక్కడినుంచి నేరుగా వరదకాలువ ద్వారా శ్రీరాజరాజేశ్వరడ్యాంకు పరవళ్లుతొక్కుతూ నీరు ప్రవహిస్తుంది. మూడు పంపులు ఒకేసారి విడుదల చేయడంతో వరద కాలువ నిండుగా ప్రవహించడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతుంది. ఒక్కో పంపు 3150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈనేపథ్యంలో మూడుపంపుల ద్వారా(0.29 టీఎంసీల) 9450 క్యూసెక్కుల నీటిని ఎస్సారార్ డ్యాంకు తరలిస్తున్నారు.

### వరద కాలువ ఆయకట్టు రైతుల ఆనందం

**గంగాధర:** వరద కాలువకు నీరు విడుదలతో గంగాధర మండల పరిధిలోని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాయంత్రి పంపు హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా రోజుకు ఒక్కొక్క పంపు నుంచి 3350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. వరదకాలువ నుంచి రెండు రోజులుగా 10వేల క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. దీంతో వరదకాలువ ఆయకట్టు మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, గర్షకుర్తి, గట్టుబూత్కుర్, ఆచంపల్లి గ్రామాల వ్యవసాయ పంటలకు వరద కాలువ నీరు వినియోగించుకోవచ్చు. వరద కాలువలో నీరుండటంతో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఈ సీజన్‌లో ఇప్పటి వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వరదకాలువకు అధికారులు నీరు విడుదల చేస్తుండగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి



నగరంలో మహిళలతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భగత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్ కాలనీలలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా స్థానిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కోతిరాంపూర్, కట్టరాంపూర్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రోడ్డుపైన అనేక గుంతలు ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మహిళలకు నెలకు 2,500రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. మహిళా సమస్యలు పరిష్కరించకపోతే అందరిని ఐక్యంచేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ, గుడికందుల సంధ్య, మంచినీళ్ల లావణ్య, ఉప్పునూటి లక్ష్మి, స్రవంతి, భవాని, రజని, మున్నా, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పీడ్ గన్

- వాహనాల వేగం 80దాటితే చాలన్ పడ్డట్టే

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజీవ్ రహదారిపై గురువారం తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ కలిసి స్పీడ్ గన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కొసమే స్పీడ్ గన్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనాల వేగం 80దాటితే చాలన్ పడుతుందని తెలిపారు. గురువారం మొదటి రోజు అతివేగంగా వెళుతున్న సుమారు 20వాహనాలకు స్పీడ్‌గన్ ద్వారా చాలన్‌లు పడినట్లు తెలిపారు. వాహనాదారులు వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు.



స్పీడ్‌గన్‌ను పరిశీలిస్తున్న సీఐ సదన్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ గౌడ్

# గిరిజన తండాల్లో తీజ్ సంబరాలు

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల బతుకమ్మగా కొలిచే తీజ్ ఉత్సవాలను గిరిజన తండాల్లో గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. యువతుల, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతిసంవత్సరం శ్రావణమాసంలో గిరిజనతండాల్లో మహిళలు తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. గోధుమలను నానపోసి నారుగా పెరిగిన తర్వాత తొమ్మిదిరోజులపాటు ఉపవాసదీక్షలు యువతులు, మహిళలు చేసి కుటుంబసభ్యులు, పంటలు బాగుండాలని వేడుకొని మహిళలు గోధుమ నారును నెత్తిన పెట్టుకొని ఆయా చెరువులో నిమజ్జనం చేశారు.

**గంభీరావుపేట:** మండలంలోనిలింగన్నపేట తండాలో గురువారం తీజ్‌ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గోదుమనారుతో చేసిన బతుకమ్మలను సంప్రదాయ నృత్యాలతో తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజనం చేశారు.

**మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలోని బంజారాలు భక్తిశ్రద్ధలతో తీజ్‌పండగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం మల్లాపూర్ గ్రామశివారులో ప్రత్యేకపూజలు జరిపి వేడుకలు నిర్వహించారు. బంజారాలు తమసంప్రదాయం ప్రకారం ప్రత్యేకబుట్టలో గోధుమలనువేసి నిత్యం ఉదయం, సాయంత్రం తొమ్మిదిరోజులపాటు నీళ్లుపోసి పెంచారు. వాటిని అలంకరించిన బుట్టలో ఏర్పాటుచేసుకుని నెత్తినపెట్టుకొని సంప్రదాయ బద్ధంగా మహిళలు, యువతులు నృత్యాలుచేస్తూ చెరువులు, కుంటల వద్దకు వెళ్లారు. అక్కడ ప్రత్యేకపూజలు చేసి నిమజ్జనం చేశారు.



కోనరావుపేట గిరిజన తండాలో తీజ్ ఉత్సవాల్లో యువతులు



లింగన్నపేటలో తీజ్ ఉత్సవాల్లో మహిళలు



మల్లాపూర్‌లోని తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు, బాలికలు

# భూ సేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్ల కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ వేగవంతం చేయాలని, భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భారత జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ సంచాలకులు దుర్గాప్రసాద్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబుతో కలెక్టర్ పమేలా సత్పతి భూసేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సేకరణకు సహకరించేలా చూడాలని అన్నారు. భూసేకరణలో ఉన్న సమస్యలన్నింటిని త్వరగా పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జాతీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలని సూచించారు.

# పెన్సిల్ మొనపై త్రివర్ణ పతాకం

ఓదెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక గ్రామానికిచెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ 79వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పెన్సిల్ గ్రాఫైట్‌పై జాతీయజెండాను తయారుచేశారు. సుమారు గంట పాటు శ్రమించి నాలుగు మిల్లీమీటర్ల ఎత్తు రెండు మిల్లీమీటర్ల వెడల్పుఉన్న జాతీయ జెండాను తయారు చేశారు.



పెన్సిల్ మొనపై జాతీయ పతాకం

గతంలో చాక్‌పీస్‌పై 7 మిల్లీమీటర్ల ఎత్తు5మీ.మీ. వెడల్పుఉన్న జాతీయ జెండాను చెక్కి రంగులు అద్దారు. చాక్‌పీసులపై హ్యాపీఇండిపెండెన్స్‌డే ఆంగ్లఅక్షరాలను 6మిల్లీమీటర్ల ఎత్తు 5మిల్లీమీటర్ల వెడల్పుతో గుండు పిన్ను సహాయంతో చెక్కారు. రజనీకాంత్ ఇంతకుముందు చాక్‌పీస్‌పై జాతీయ గీతం జనగణమన 278 అక్షరాలను, జాతీయ గేయం వందేమాతరం 284 ఆంగ్ల అక్షరాలను చాక్ పీస్, బియ్యపు గింజలపై రాశారు. అదేవిధంగా 1.5సెంటీమీటర్ ఎత్తు ఉన్న చాక్‌పీస్‌లపై 78జాతీయ జెండాలను తయారు చేశాడు. అదే విధంగా ఒకేచాక్‌పీసు పైరెండు మిల్లీమీటర్ల ఎత్తులో 78త్రివర్ణ పతాకాలను చెక్కారు. ఈ పెన్సిల్ గ్రాఫైట్ జాతీయజెండాను ప్రపంచంలోని వివిధ బుక్‌ఆఫ్‌రికార్డులకు ప్రతిపాదనలుపంపినట్లురజనీకాంత్ తెలిపారు.

### సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

- గుండు పిన్ను మొనపై జాతీయ జెండాతో పరుగెడుతున్న మహిళ విగ్రహం

జగిత్యాల క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మకళాకారుడు తన ప్రతిభను చాటాడు. స్వాతంత్ర్య పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత సూక్ష్మవిగ్రహం తయారు చేసి అబ్బురపరిచాడు. గుండుపిన్ను మొనపై జాతీయ జెండాను చేతితో పట్టుకుని పరుగెడుతున్న మహిళ సూక్ష్మ విగ్రహాన్ని తయారు చేశాడు. 10 గంటల సమయంలో మైనంతో పాటు పెన్సిల్ కలర్లు, గుండు పిన్ను ఉపయోగించి ఈ విగ్రహాన్ని తయారు చేసినట్లు సూక్ష్మ కళాకారుడు దయాకర్ తెలిపాడు.



గుండు పిన్నుపై జాతీయ పతాకం

### బీసీ సంక్షేమ సంఘం నాయకుడి నిరసన

గణేశ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక మూతబడ్డ పాఠశాల స్థాయి బీసీ వసతి గృహాన్ని కళాశాల స్థాయి వసతి గృహంగా మార్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్లకార్డ్ పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో గల పాఠశాల స్థాయి బీసీ బాలికల వసతి గృహాన్ని విద్యార్థులు లేరని మూసి వేశారన్నారు. సంరక్షణ అధికారిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపారన్నారు. అధికారులు మూసివేసిన వసతి గృహాన్ని బీసీ బాలికల కళాశాల వసతి గృహంగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో..

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాసాగర్ ప్రాజెక్టులోకి గురువారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 13,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను గురువారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,500 క్యూసె క్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 45.758 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిషన్‌భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,088 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 600క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 75క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 180క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 502క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్1వతేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 40.850 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 8.003 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

# ఎగువ మానేరు జలాశయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

- ప్రస్తుత నీటి నిలువ, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై ఆరా..

గంభీరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గంభీ రావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశ యాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో మానేరు ప్రాజెక్టును పరిశీలించి, ప్రస్తుత నీటినిలువ, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై కలెక్టర్, ఎస్పీ ఆరాతీశారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం, నిలువ ఎంత, ఇన్‌ఫ్లో ఎంత అని నీటి పారుదలశాఖ అధికారుల నుంచి ఆరాతీశారు. ప్రాజెక్టు నీటిమట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.3 టీఎంసీల నీరు ఉన్నాయని, ఎగువ నుంచి 400 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుందని, అధికారులు కలెక్టర్, దృష్టికి తీసుకెళ్ళారు. వరద ఇలాగే కొనసాగితే 10రోజుల్లో జలాశయం పూర్తిగా నిండుతుందని వారు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 13వేల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుందని, ఎడమ కాలువ కింద 700 ఎకరాలు, కుడి కాలువ కింద 12వేల ఎకరాలు సాగవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డ్యాం గేట్లను పరిశీలించి, వాటి నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించారు. భారీవర్షాల నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు సమయంతో అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటి మట్ట అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. డ్యాం పూర్తిగా నిండితే ఎక్కువైతే నీటిని కాలువల ద్వారా విడుదల చేయాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారి కిషోర్‌కుమార్, ఈఈ ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఎగువ మానేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

## ఆర్‌ఎఫ్‌సీఎల్ మళ్లీ షట్‌డౌన్

(5వ పేజీ తరువాయి)

పూర్తి అంతరాయం ఏర్పడింది. తిరిగి ప్లాంట్ ఉత్పత్తిలోకి రావాలంటే కనీసం వారం నుంచి పది రోజులు పట్టే అవకాశం ఉంది. అమ్మోనియా పైప్‌లైన్‌లలో మరిన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నట్టు తెలుస్తుంది. ఇటీవల ప్లాంట్ మరమ్మతు సమయంలోనే బలహీనంగా ఉన్న పైప్‌లైన్లను గుర్తించినా యూరియా డిమాండ్ దృష్టిలో ఉం చుకుని నడిపించే ప్రయత్నం చేసినట్టు చర్చ జరుగుతుంది. వరస సాంకేతిక వైఫల్యాలు ఆర్‌ఎఫ్‌సీఎల్ వర్గాలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రెండు సార్లు ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ప్లాంట్ మరమ్మతులపై వెంటనే నిర్ణయం తీసుకో లేని పరిస్థితులు ఉన్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్ హెడ్ క్వార్టర్ నోయిడాలో ఉండడం, విధానపరమైన నిర్ణయాల్లో జాప్యం ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. గత నెలలో ప్లాంట్ షట్‌డౌన్ అయితే నాలుగైదు రోజులకు కానీ పూర్తి స్థాయిలో స్పందించని పరిస్థితులు ఉన్నాయి. రామ గుండంలో ప్లాంట్ ఉంటే కేంద్ర కార్యాలయం నోయిడాలో ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో అప్రువల్స్‌కు జాప్యం జరుగుతుందనే విమర్శలున్నాయి. ఆర్‌ఎఫ్‌సీ ఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన విషయమై యాజమాన్య వర్గాలను సంప్ర దించే ప్రయత్నాలు చేయగా ఎవరూ స్పందించడం లేదు.

### ఎఫ్ఎల్ఎన్ మేళా

ఎలిగేడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కార్యక్రమం ఎంఈఓ నరేంద్ర చారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్ ప్రారంభించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన అభ్యసన సామగ్రిని పరిశీలించి అభినందించారు.

## సహకార సంఘాల పాలకవర్గాల గడువు పొడిగింపు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ హయాంలోని పార్టీలకు చెందిన వారే అధికంగా ఉన్నారని, సకాలంలో ఎన్నికలు నిర్వహించనట్టయితే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు, నాయకులకు అవకాశాలు వచ్చేవని భావిస్తున్నారు. రెండోసారి కూడా పొడిగింపు ఉత్తర్వులు రావడంతో సహకార సంఘాల పదవులపై అశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలకు కార్యకర్తలకు తీవ్ర ఆశాభంగం కలిగినట్టుగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

మంథని, (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, రాష్ట్ర వ్యవసాయ, సహకారం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుల చిత్రపటాలకు సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గం గురు వారం క్షీరాభిషేకం చేశారు. పాలకవర్గం గడువును ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించడం పై చైర్మన్ కొత్తశ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ రైతులకు మరో ఆరు నెలలు సేవచేసే అవకాశం ప్రభుత్వం కల్పించడం హర్షనీయమన్నారు. డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, సిరిమూర్తి ఓదెలు, గడ్డం పోచం, లెక్కల కిషన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, దేవళ్ళ విజయ్‌కుమార్, దాసరి లక్ష్మిమొండ య్య, ఉడుత మాధవిపర్వతాలు యాదవ్‌లు పాల్గొన్నారు.



మంథనిలో క్షీరాభిషేకం చేస్తున్న పాలక వర్గం సభ్యులు

## పాఠశాలల్లో ముందస్తు క్రిష్ణాష్టమి వేడుకలు



సుల్తానాబాద్ కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

సుల్తానాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో గురువారం ముందస్తు క్రిష్టాష్టమి వేడుకలు నిర్వహించారు. ఐపీఎస్ స్కూల్‌లో చిన్నారులు కృష్ణుడి, గోపికలు వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉట్టి కొట్టె వేడుకలు కన్నుల పండుగగా జరిగింది. చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, పీఈటీ సత్యనారాయణ పాల్గొన్నారు. అల్ఫోర్స్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణాష్టమి పండుగ విశిష్టత వివరించారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్వీ లిటిల్ కిడ్స్ పాఠశాలలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణ, రాధ గోపికల వేషధారణలతో ఉట్టి కొట్టే వేడుకలను నిర్వహించారు. కరస్పాండెంట్ సీహెచ్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకుర్తి,(ఆంధ్రజ్యోతి): పుట్నూర్ గ్లోబల్ పాఠశాల, ఈసాలతక్కళ్లపల్లి జేమ్స్ మోడల్ పాఠశాలలో కృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నృత్యాలు చేస్తు ఉట్టి కొట్టారు.



ఈసాలతక్కళ్లపల్లి పాఠశాలలో ఉట్టి కొట్టిస్తున్న ఎమ్మెల్యే



ఎలిగేడులో వేషధారణలో చిన్నారులు

కరస్పాండెంట్ బుర్ర సత్యం గౌడ్, ప్రిన్సిపాల్ గండు సతీష్ కుమార్, ఇన్‌చార్జ్ శ్రీరాముల లావణ్య పాల్గొన్నారు. ఈసాలతక్కళ్లపల్లిలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, మక్కాన్ సింగ్ సేవసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, కరస్పాండెంట్ జాలపల్లి మహేష్, ప్రధానోపాధ్యాయురాలు జాలపల్లి స్వప్న పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): కాసులపల్లి ట్రినిటి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వేషధారణలతో నృత్యాలు చేసి అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యాలయాలను బలోపేతం చేయాలి

మంథనిరూరల్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): పేదలు చదివే విద్యాలయాలను ప్రభుత్వం బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పుట్ట మధు గురువారం సందర్శించారు. కళాశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 320 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 120కి చేరిందన్నారు. మంత్రి ఒక్కసారి కళాశాలను సందర్శించి సమస్యలు, సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మంత్రికి చిత్తశుద్ధి ఉంటే కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. బిల్డింగ్‌ను పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల సౌకర్యం కోసం బస్సు ఏర్పాటు చేస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టించడం తప్ప చేసేది ఏంలేదని, ఈలాంటి కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు చేసిన తాను భయపడనన్నారు. జేఎన్‌టీయూ కాలేజీ ఎవరి ఉపయోగపడుతుందో జవాబు చెప్పాలన్నారు. కుట్రలు కుతంత్రాలకు నిదర్శనం దుద్దిళ్ళ కుటుంబమన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మాచీడి రాజుగౌడ్, ఏగోళపు శంకర్‌గౌడ్, కనవేన శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, ఎరుకల రవి, పుప్పాల తిరుపతి, కాయితి సమ్మయ్యలు పాల్గొన్నారు.

### రెస్టారెంట్లు, ఆసుపత్రులకు జరిమానాలు

కోల్‌సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని రెస్టారెంట్‌లో గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని సాయిలీలా రెసిడెన్సీ, హైకింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో నాణ్యత లేని ఆహారం ఇచ్చారని వినియోగదారుడు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు జరిపారు. సరైన నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను విక్రయించినట్టు గుర్తించామని కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం పేర్కొన్నారు. సాయిలీలా రెసిడెన్సీ, హైకింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు రూ.10వేల జరిమానా విధించినట్టు తెలిపారు. తనిఖీల్లో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, శానిటరీ జవాన్ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు. ప్రమాదకరమైన ఆసుపత్రి వ్యర్థాలను రోడ్లపై వేయడంపై అదనపు కలెక్టర్, నగర కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. బయోమెడికల్ వేస్ట్‌ను రోడ్లపై వేసిన లక్ష్మీనగర్‌లోని శ్రీఆదితి ఆసుపత్రికి రూ.1లక్ష, సత్యం ఆసుపత్రికి రూ.50వేలు, వెంకటస్వామి క్లినికల్ ల్యాబ్‌కు రూ.10వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో శానిటరీ జవాన్లు అశోక్, సోమేశ్వర్, ఉమామహేశ్వర్, సంపత్ పాల్గొన్నారు.

## ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి**

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికపై ఆసక్తి ఉంటే ఉద్యోగం వెతుక్కుంటూ వస్తుందని ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులు ట్రినిటి ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలను ఎంచుకోవడం ఒక మంచి నిర్ణయమని తెలిపారు. తమ కళాశాలల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడం కోసం ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ 40 ఏళ్లుగా సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎప్పుడు నూతన సాంకేతికత వైపు దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నతలక్ష్యాలతో మంచి భవిష్యత్‌ను చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే తల్లితండ్రులు విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారిని చదువు వైపు మళ్లించేలా చూడాలన్నారు. జేఎన్టీయూ కొండగట్టు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి ప్రొఫెసర్ సతీష్, ఎస్ఆర్ఆర్ యూనివర్సిటి రీసెర్చ్ అండ్ డీన్ ప్రొఫెసర్ సమ్మయ్య, మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్‌లు, కళాశాల డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేషన్, ప్రొఫెసర్ సతీష్, శ్రీనివాస్, సమ్మయ్య, ఏఓ సురేష్, వంశీ, పద్మిని, ప్రభాకర్, పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పాలనలో ప్రజలకు పలు సంక్షేమ పథకాలు

పాలకుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దొరల పాలన పోయి రాష్ట్రంలో ప్రజాపాలన రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. గురువారం బసంత్‌నగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి, కొత్తపల్లె, రామరావుపల్లె, పుట్నూర్, గుడిపెల్లి, జయ్యారం, వేంనూర్, కుక్కలగూడూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కోట్లాది రూపాయలతో గ్రామాల్లో నూతనంగా పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ధాన్యానికి మద్దతు ధరకు కొనడంతోపాటు సన్నాలకు 500 బోనస్ అందించామన్నారు. గత పాలకులు 10 సంవత్సరాలు పాలించి ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూంలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ ప్రాంత రైతుల చిరకాలవాంఛ బండలవాగు ప్రాజెక్టు నిర్మాణంతో నెరవేరుతుందని, పాలకుర్తిలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించి పసిడి పంటల్లో కోనసీమను ఘైమరిపించేలా చేస్తానని హమీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం తిరుపతి,కన్నాల పీఏసీఎస్ చైర్మెన్ బయ్యపు మనోహర్ రెడ్డి,డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య,మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీజేపీ తిరంగా యాత్ర

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర గురువారం కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప దేవాలయం నుంచి అమర్ నగర్, మజీద్, జెండా చౌరస్తా వరకు పార్టీ శ్రేణులు జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో దేశ ప్రతిష్ఠ ప్రపంచంలోని అన్ని దేశాల్లో కీర్తించాయని నాయకులు పేర్కొన్నారు. రాంసింగ్, నల్ల మనోహర్ రెడ్డి, పల్లె సదానందం, చక్రధర్ రెడ్డి, క్రాంతి, లక్ష్మినారాయణ, ఫహీం, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): హర్‌గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికి జాతీయ జెండా పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు తీగుళ్ల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ర్యాలీని ప్రారంభించి జెండాలను పంపిణీ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొమ్ము రాంబాబు, బీజేపీ నాయకులు మెడవేని శ్రీనివాస్, దేవి రాజలింగయ్య, మని, గోనె సాయికృష్ణ, దేవి కొమరేష్, కొక్కుల బాలు పాల్గొన్నారు.

### 17న ఖని నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సును నడిపించనున్నట్టు డిపో మేనేజర్ నాగభూషణం పేర్కొన్నారు. ఈ నెల 17న మధ్యాహ్నం 3గంటలకు కాణిపాకం, అరుణాచలం, వేలూరు, విష్ణుకంచి, శివకంచి, జోగులాంబ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణం 21న గోదావరిఖనికి చేరుకుంటుందని, పెద్దలకు రూ.5600, పిల్లలకు రూ.4400 నిర్ణయించామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన



సన్మానిస్తున్న అధికారులు

ఎలిగేడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ధూళికట్టలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా కేంద్ర బృందం సభ్యులు మధు, రజిత గురువారం పర్యటించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల వాడకం, మురికి కాలువ నిర్వహణపై ఫొటోలు తీసుకున్నారు. వారిని పలువురు అధికారులు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందించారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీఓ కిరణ్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రాఘవులు, ఏపీఓ సదానందం, మాజీ సర్పంచ్ గొల్లె కావేరి భూమేష్, కార్యదర్శులు పున్నమయ్య, శివ కుమార్, సురేష్, శిరీష, హరిబాబు, పావన్న, అంజలి పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలను నిర్మూలించాలి

కమాన్‌పూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కౌన్సిలర్ సతీష్ అన్నారు. గురువారం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్య నిర్మూలన సమాజం కోసం నశా ముక్త్ భారత్ చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత జీవితాన్ని డ్రగ్స్ నాశనం చేస్తున్నదని అన్నారు. మత్తుకు బానిసలుగా మారి నేరాలు, ఆకృత్యాలు చేస్తున్నారని తెలిపారు. బాలల సంరక్షణ చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజం కోసం పాటుపడుతున్నాయన్నారు. హెడ్‌మాస్టర్, టీచర్లు, భరోసా జిల్లా కోఆర్డినేటర్ ఆశీత, అస్మా, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### యునాని ఆసుపత్రి వైద్యుడిగా మహేష్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామంలో గల యునాని ఆసుపత్రి వైద్యుడిగా మహేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. మహేష్ మాట్లాడుతూ యునాని వైద్యం ఎంతో ఉపయోగపడుతుందని ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని తెలిపారు. గురువారం మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాత రమేష్, నారాయణ, కొమురయ్య తదితరులు వైద్యుడు మహేష్‌ను సన్మానించారు.

### అగ్ర వర్ణాలకు రిజర్వేషన్లు కల్పించాలి

సుల్తానాబాద్, ఆగస్టు 14: (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు సైతం రిజర్వేషన్లు కల్పించాలని రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు చిగిరి సతీష్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అగ్రవర్ణాలలో అనేక మంది పేదలు ఉన్నారని, వారి జీవితాలు దుర్భరంగా ఉన్నాయని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సతీష్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 19, 20 తేదీలలలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చామని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఏసీపీ జన్మదిన వేడుకలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ జన్మదిన వేడుకలను గురువారం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఎస్ఐగా సేవలందించిన సమయంలో ఇక్కడ ఎనలేని సేవలందించారని గుర్తు చేసుకున్నారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### రేపు జిల్లాస్థాయి వాలీబాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కోల్‌సిటీ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌టీపీసీ జ్యోతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మైదానంలో అండర్ 15 బాల, బాలికల వాలీబాల్, సుబ్రతో ఫుట్‌బాల్ అండర్ 15 బాలుర, 17 బాలుర ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు మైదానికి చేరుకోవాలని, అర్హత ఫారంతోపాటు బోనోఫైడ్, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ జత చేసి తీసుకురావాలని పేర్కొన్నారు. వాలీబాల్‌కు ఎంపీయిన జట్లను ఈనెల 18, 19 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు, ఫుట్‌బాల్ ఎంపిక జట్లను ఈనెల 21, 22 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారని తెలిపారు.

### సదస్సును విజయవంతం చేయండి

పాలకుర్తి,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఈనెల 20న జరిగే వికలాంగుల, చేయూత పెన్షన్‌దారుల సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండల రాజేందర్ మాదిగా పిలుపు నిచ్చారు. గురువారం కుక్కలగూడూర్‌లో మాట్లాడుతూ సదస్సుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగా హాజరవుతారన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్క మహేష్, ఉపాధ్యక్షులుగా బెక్కెం రాజేశ్వరి, ప్రధానకార్యదర్శిగా జాసిన, ప్రచార కార్యదర్శిగా బెక్కెం మల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా రాజమ్మ, కార్యదర్శిగా కుక్క దుర్గయ్య, కార్యవర్గ సభ్యులుగా నంబయ్య, ములకల నర్సమ్మ, పద్మ ఎన్నికయ్యారు.

### రెండు రోజులు మాంసం విక్రయాలు బంద్

కోల్‌సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో స్వాతంత్ర్య దినోత్సవం, శ్రీకృష్ణాష్టమి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 15, 16 తేదీల్లో మాంసం విక్రయాలు నిలిపివేస్తున్నట్టు నగర కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఉల్లంఘించి విక్రయాలు జరిపితే లైసెన్స్ రద్దుచేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పొలంలోకి దూసుకెళ్లిన కారు

ఓదెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బాయమ్మపల్లెలో గురువారం కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. హన్మకొండ నుంచి టీఎస్ 03 ఎఫ్‌బి 9191 నెంబర్ గల కారులో మడకలో వివాహానికి వేగంగా వెళుతుండగా మూలమలుపు పొలంలో ఉన్న బావి వైపు దూసుకెళ్లింది. కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో ఆగిపోయింది. కారులో ఉన్న దంపతులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

### సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం

ఓదెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను అరెస్టు చేసినందుకు నిరసనగా గురువారం మండలంలోని కనగర్తిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులకు సమాచారం అందడంతో అడ్డుకొన్నారు.

### ఆలయ చైర్మన్ కు సన్మానం

ఓదెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, ధర్మకర్త తీర్థాల రాజారాంను సన్మానించారు. చైర్మన్‌గా నియమాకానికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు కృషిపై పద్మశాలీలు హర్షం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు, సారంగం, బీష్మచారి, వెంకటేశ్వర్లు, రామచంద్రం పాల్గొన్నారు.




### ఆర్జీ-3, ఏపిఏ ఉత్తమ ఉద్యోగులు వీరే..

రామగిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌లలో ఉత్తమ ఉద్యోగుల జాబితాను గురువారం సింగరేణి పర్సనల్ విభాగం అధికారి సుదర్శనం ఒక ప్రకటనలో విడుదల చేశారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సింగరేణి ప్రధాన వేడుకలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సింగరేణి సిఎండి బలరామ్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలను అందుకొనున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-3 ఏరియా ఓసిపి-2 గనిలో ఈపి ఆపరేటర్‌గా పనిచేస్తున్న కుంసోత్ కృష్ణ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని ఎఎల్‌పి గనిలో మల్టీజాబ్‌వర్కర్‌గా పనిచేస్తున్న నల్లవెల్లి మల్లేష్ ఎంపికయ్యారు. అదే విధంగా ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకల్లో ఏరియాల జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు ఉద్యోగులను సత్కరించనున్నారు. ఓసిపి-1 ఈపి ఆపరేటర్ భద్రయ్య, ఫిట్టర్ సరిపెల్లి తిరుపతి, ఓసిపి-2లో ఈపి ఆపరేటర్ బబ్బుల శ్రీనివాస్, ఫోర్‌మెన్‌గా కోడం రమేష్, ఏఎల్‌పి గనిలో ఆపరేటర్ కటుకు మహేంద్రప్రసాద్, ఎలక్ట్రీషియన్ వీర్ల సంపత్‌కుమార్, ఫిట్టర్ రాధాక్రిష్ణలు ఎంపికయ్యారు. ఉత్తమ ఉద్యోగులను జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, అదికారులు అభినందనలు తెలిపారు.

## ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటేనే లాభాలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటేనే సింగరేణి లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందని ఆర్జీ-2 జీఎం సుధాకర్‌రావు అన్నారు. గురువారం ఓసీపీ-1 సైటాఫీస్‌లో జరిగిన మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత వరకు ఉత్పత్తి వ్యయం తగ్గించేలా కృషి చేయాలన్నారు. గైర్హాజరు లేకుండా విధులకు హాజరవుతూ పని గంటలు పూర్తిస్థాయిలో సద్వినియోగం జరగాలని సూచించారు. సింగరేణి బొగ్గు కన్నా తక్కువ ధరకు బొగ్గు అందుబాటులో ఉంటున్నదని, వినియోగదారులను కోల్పోకుండా ఉండాలంటే తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమిష్టి కృషితో నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడం, పోటీ ప్రపంచంలో బొగ్గు మార్కెట్‌లో ఎదురవుతున్న సవాళ్ళను సమిష్టిగా అధిగమిస్తే సంస్థ పురోభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. తిరుపతిరావు, గడ్డం తిరుపతి, అధికారులు శేఖర్‌బాబు, చంద్రశేఖర్, సుదర్శనం, రాజశేఖర్, ఉదయ్‌భాస్కర్, పాపయ్య, సాయి స్వరూప్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్జీ-2లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓసీపీ-3 ప్రాజెక్టులోని సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లలో మల్టీడిపార్ట్ మెంట్ సమావేశాలను నిర్వహించింది. సీహెచ్‌పీలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందించేలా ఉద్యోగులు కృషి చేయాలని ఎస్వోటూ జీఎం సం తోష్‌కుమార్ సూచించారు. ఏరియా వర్క్‌షాప్‌లో యంత్రాల విడిభాగాల మరమ్మతు సమర్థవంతంగా సమయానికి పూర్తయ్యేలా పనితీరు మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. అధికారులు స్వజన్‌మెహ్రా, అరవిందరావు, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, రాంరెడ్డి, ఏవీ శ్రీనివాస్, నాయకులు సాంబశివరావు, సెగ్గెం శంకర్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

### క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 షావల్ అండ్ డ్రిల్ సెక్షన్ మ్యాన్‌వే క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలని కార్మికులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సెక్షన్ కార్మికులు సంతకాలు సేకరించి సదరు క్లర్క్‌ను మ్యాన్‌వే నుంచి తప్పించాలని వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్మికులను చులకనగా మాట్లాడడం, దురుసుగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు కార్మికులు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఓ కార్మికుడిని దూషించినట్లు పేర్కొన్నారు. గతంలోనూ సదరు క్లర్క్ వైఖరిపై అధికారులకు ఫిర్యాదు చేసినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని, మ్యాన్‌వే విధుల నుండి క్లర్క్‌ను మార్చాలని కార్మికులు డిమాండ్ చేశారు.

### అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న అధికారుల సంఘం నేతలు

రామగిరి, ఆగస్టు 14(ఆంధ్ర జ్యోతి): సింగరేణి అధికారుల వేతనంలో భాగమైన పెర్ఫార్మన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పి) కోసం సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గురువారం డివిజన్ పరిధిలోని ఓసిపి-1,2, ఏఎల్‌పి, నల్లబ్యాడ్జిలు ధరించి జీఎం కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సిఎంవోఏ నాయకులు మాట్లాడుతూ 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పిఆర్‌పి చెల్లింపు చేపట్టడం లేదన్నారు. ఒక పక్క కోల్ ఇండియాలో ప్రతి సంవత్సరం చెల్లిస్తున్నప్పటికి సింగరేణి స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమస్య పరిష్కారానికి ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సింగరేణి సిఎండి బలరాంనాయక్‌లు స్పందించాలని కోరారు.

## సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ధర్నా

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఐఎన్‌టీయూసీ శ్రేణులు ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేశాయి. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ మాట్లాడారు. జూలైలో జరిగిన మెడికల్ బోర్డు కార్మికులకు అన్యాయం జరిగిందని, రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్‌తోపాటు ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని, సొంత ఇంటి పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై ఐటీని రీయింబర్స్ చేయాలని, సేఫ్టీ ట్రైపార్టైడ్ సమావేశాలు నిర్వహించాలన్నారు. సెక్టార్-3 కాలనీలో చాలా క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతు చేయాలని, మెరుగైన క్యాడర్ స్కీం, నూతన ప్రమోషన్ పాలసీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రుల్లో నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలని, రెఫరల్ సిస్టంను మార్చాలని, 35 శాతం లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. అక్రం, సత్యనారాయణరెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, ఆకుల రాజయ్య, సమ్మయ్య, రవీందర్, అవినాష్, వంగ సురేష్, జగదీష్, నర్సయ్య, మార్కండేయ పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయుసీ నాయకులు

రామగిరి,(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్ జీఎం కార్యాలయం ఎదుట దీర్ఘకాలికంగా కార్మి కులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్క రించాలని జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్‌టీ యుసీ నాయకులు ధర్నా చేపట్టారు. ప్రధాన 15 డిమాండ్‌ల పరిష్కరించాలని ధర్నా చేప ట్టారు. అనంతరం ఏపిఏ జీఎం నాగేశ్వర్ రావుకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, కార్మిక నేతలు పాల్గొన్నారు.